సాక్షి నిర్మల్

బుధవారం । 19 । జూలై । 2023

7

సమస్యల్లో సర్కారు బడులు



ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు దర్శనమిస్తున్నాయి. పిల్లల చదువులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో కానరావడం లేదు. 9లో▸

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

నిర్మల్‌చైన్‌గేట్‌:జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. దీంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వరుణ్‌రెడ్డి తెలిపారు. అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైననంబర్ 9398749227కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 26.3/24.2

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలలో తేమశాతం పెరుగుతుంది. రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లా అంతటా వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన ఎస్సైలు



ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో విధుల్లో చేరిన ఎస్సైలు

నిర్మల్‌చైన్‌గేట్‌:బాసర జోన్ పరిధిలోని ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల నుంచి నిర్మల్ జిల్లాకు బదిలీపై వచ్చిన పది మంది ఎస్సైలు మంగళవారం విధుల్లో చేరారు. ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు.

ఆయిల్‌పాం ఫ్యాక్టరీ స్థల పరిశీలన




ప్రకృతివనాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

సోన్‌: మండలంలోని పాక్‌పట్ల గ్రామ సమీపంలో నిర్మించనున్న ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కి శంకుస్థాపన చేయనున్నారు. దీంతో కలెక్టర్ వరుణ్‌రెడ్డి మంగళవారం ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత బృహత్ ప్రకృతి వనం, పల్లె ప్రకృతి వనం సందర్శించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్, కార్యదర్శి సంధ్యారాణి ఉన్నారు.

పౌరసరఫరాల శాఖలో బదిలీలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాల్లో పని చేస్తున్న సహాయ పౌరసరఫరాల శాఖ అధికారు(ఏసీఎస్‌వో)లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్రంలో మల్టీ జోనల్ పోస్టులు ఉన్న ఏసీఎస్‌వోలను కొత్త స్థానికత ప్రకారం ఆయా జిల్లాలకు బదిలీ చేశారు. పలు జిల్లాలో ఏసీఎస్‌వోలే డీసీఎస్‌వోలుగా వివిధ ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై ఎఫ్‌ఏసీలుగా కొనసాగుతున్నారు. మంచిర్యాల(ఎఫ్‌ఏసీ)(ఒరిజనల్ పోస్టు మేడ్చల్) డీసీఎస్‌వో ఏ.ప్రేమ్‌కుమార్‌ను పెద్దపల్లి జిల్లాకు, ఆదిలాబాద్ జిల్లా పని చేస్తున్న ఆర్ సుదర్శనంను వనపర్తికి, అలాగే వి.బాలరాజును మేడ్చల్ మల్కాజ్‌గిరికి బదిలీ చేశారు. మంచిర్యాల జిల్లాలో రెగ్యులర్ పోస్టులో ఉన్న ఎం.శ్రీనివాస్‌రెడ్డిని భువనగిరికి, వనపర్తి జిల్లా నుంచి జి.బాబా వినోద్ కుమార్‌ను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, నిర్మల్ జిల్లాకు హైదరాబాద్‌లో పని చేస్తున్న షేక్ మహమ్మద్ అలీని నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ పథకాలపై మంత్రి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

నిర్మల్‌చైన్‌గేట్‌:జిల్లాలో అమలు చేస్తున్న వివిధ పథకాలపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి మంగళవారం సమీక్ష నిర్వహించారు. నూతన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో డీఆర్డీవో, డీటీడీవో, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, మిషన్‌భగీరథ, విద్యుత్ తదితర శాఖలు, వాటి పరిధిలోని పథకాల అమలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐకేరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రజల కోసం ప్రవేశ పెట్టిందన్నారు. ప్రతీ పథకం అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. జిల్లాకు కేటాయించిన ఆయిల్‌పాం సాగు లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి మంత్రి కేటీఆర్ త్వరలో శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్‌:వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ సూచించారు. నిర్మల్ పట్టణంలో మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. నీటిని వెంటనే తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పగిలిపోయిన కుండలు, రంజన్లు, ప్లాస్టిక్ డబ్బాలు ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు మొదలైనవి ఎక్కడ పడితే అక్కడ వేయడం వలన దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం వివిధ సెల్లార్లలో నిలువ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్‌ను స్వయంగా వేశారు. కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసరెడ్డి, బోజారెడ్డి పాల్గొన్నారు.

వానొచ్చినా.. వరద రాలే!



కడెం ప్రాజెక్టులోకి స్వల్పంగా చేరిన కొత్త నీరు..

- జిల్లాలో వారం రోజులుగా ముసురు వాన
- మహారాష్ట్రలోనూ నామమాత్రమే..
- ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో అంతంతే
- ఎగువన కురిస్తేనే.. దిగువన నిండేది

నిర్మల్: జిల్లాలో వారం రోజులుగా నిత్యం వాన కురుస్తూనే ఉంది. ముసురు పెట్టినట్లుగా ఉదయం నుంచి రాత్రి వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. అయితే వరద మాత్రం పెద్దగా రావడం లేదు. దీంతో ప్రాజెక్టుల్లోకి ప్రవాహాలు మొదలు కాలేదు. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురిస్తేనే దిగువన జిల్లాలోని జలాశయాల్లోకి వరద వచ్చిపడుతుంది. ప్రస్తుతం మరాఠ్వాడలో భారీ వర్షాలు లేకపోవడంతో జిల్లాకు వరద రావడం లేదు.

జోరుగా వాన..

వారం రోజులుగా జిల్లాను ముసురు వీడటం లేదు. తేలికపాటి నుంచి మోస్తారుగా పడుతూనే ఉంది. మంగళవారం బాసరలో అధికంగా 47.మిల్లీమీటర్ల వాన కురిసింది. ముధోల్‌లో 47, తానూరులో 35.8, నిర్మల్‌రూరల్‌లో 29.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఇక అత్యల్పంగా కుభీర్‌లో కేవలం 9.2 మి.మీ కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 22 మి.మీ నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. కుభీర్, నర్సాపూర్(జి), కుంటాల, దస్తురాబాద్, పెంబి మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. మిగితా మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

ఎగువన కురిస్తేనే..

జిల్లాలో నదులు పొంగాలన్నా, ప్రాజెక్టులు నిండాలన్నా ఎగున ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవాలి. గోదావరి జన్మస్థానమైన నాసిక్ జిల్లా నుంచి మొదలుపెడితే ఔరంగాబాద్, జాల్నా, పర్బణి, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిస్తే ఆ వరదంతా జిల్లాకు వస్తుంది. ఏటా నాసిక్ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడం, గైక్వాడ్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరుసగా దిగువ ప్రాజెక్టులన్నీ నిండుతుంటాయి. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఆశించిన వర్షాలు కురవడం లేదు. జిల్లాలోని సుద్దవాగు, స్వర్ణ, కడెం ప్రాజెక్టులతోపాటు సరిహద్దున గల ఎస్సారెస్పీ నిండాలన్నా.. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవాల్సిందే.

రెండేళ్లు జూలైలోనే..

జిల్లాలో గత రెండేళ్లుగా ఈ సమయానికి వరద బీభత్స సృష్టించింది. గత ఏడాదైతే కడెం ఏరియా జలప్రళయాన్నే చవిచూసింది. ఊహకందని భారీ వరద ప్రాజెక్టును సైతం నిండా ముంచేసింది. ఏ క్షణానైనా ఆనకట్ట తెగిపోతుందేమోనన్న ఉత్కంఠ నెలకొంది. 2021లోనూ వర్షంతోపాటు వరద బీభత్సం చూపింది. స్వర్ణ నది వరద ప్రవాహం నిర్మల్‌ను ముంచేసింది. రెండేళ్ల నుంచి మహారాష్ట్ర వరదలే జిల్లాను ముంచెత్తుతున్నాయి. ఈఏడాది ఇప్పటికీ వరద జాడ లేకపోవడంతో ప్రాజెక్టులకు ఇంకా జలకళ రాలేదు. ఈ నెలాఖరు, వచ్చేనెలలో కచ్చితంగా వరదలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ప్రాజెక్టుల నీటిమట్టం వివరాలు..

ప్రాజెక్టు	పూర్తినీటిమట్టం(అడుగుల్లో)	ప్రస్తుతం	ఆయకట్టు(ఎకరాల్లో)
కడెం	700	688.625	68,000
స్వర్ణ	1,183	354.099	10,000
గడ్డెన్న	359	356.60	14,000



సుద్దవాగు ప్రాజెక్టు

విద్యకు పెద్దపీట

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- అనంతపేట్‌లో కేజీబీవీ భవనం ప్రారంభం



కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. సీఎం కేసీఆర్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. కేజీబీవీలు ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థినులకు మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వం రూ.3.80 కోట్లతో నూతన భవనం నిర్మించిందని తెలిపారు. భవనంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, నాయకులు రామ్‌కిషన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, కుంట పద్మాకర్, అప్పల మహేశ్ పాల్గొన్నారు.

సహకార కళాశాల అభివృద్ధికి కృషి

లక్ష్మణచాంద:మండల కేంద్రంలో గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్న కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ఐడీసీ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి తెలిపారు. కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయను శాలువా, మెమొంటోతో సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సహకార రంగంలో స్థాపించబడి నేటికి నడుపబడుతున్న ఏకైక కళాశాల ఇదే అన్నారు. కలాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. గ్రామంలో 30 పడకల ఆసుపత్రి, గ్రామంలోని పుల్సేరు చెరువు తూము రిపేర్ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయించాలని గ్రామస్తులు విన్నవించారు. సమస్యలను మంత్రి ఐకేరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, కళాశాల అధ్యక్షుడు నారాయణ, కమిటీ సభ్యులు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ బిట్లింగ్ నారాయణ, ప్రిన్సిపాల్ భోజన్న గ్రామస్తులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్



వరి నారును పరిశీలిస్తున్న డీఏవో అంజిప్రసాద్

లోకేశ్వరం:వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని హవర్గ గ్రామంలో మంగళవారం వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఎక్కువగా సన్నరకం పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. పంట కాలం 150 రోజులు పడుతుందన్నారు. ఎకరాకు 25 కేజీల విత్తనం సరిపోతుందని తెలిపారు. నాటు 30-40 రోజుల మధ్య వేసుకుంటే దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. రెండు నుంచి మూడు మొలకలు మాత్రమే నాటుకోవాలన్నారు. సాధారణ వర్షపాతం నమోదైతేనే నార్లు పోసుకోవాలని సూచించారు. తెగుళ్లు సోకకుండా నాటు వేసిన 12-15 రోజుల మధ్య మొదటి విడత ఎరువులు వేయాలన్నారు. దొడ్డు రకం (1010) పంట కాలపరిమితి 120 రోజులని, 22-25 రోజుల మధ్య నాట్లు వేసుకోవాలని తెలిపారు. దొడ్డు రకం పంటలకు తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయన వెంట ఏవో గణేశ్, ఏఈవోలు భూమేశ్, మౌనిక ఉన్నారు.

మిషన్ ఇంద్రధనస్సుపై శిక్షణ



మాట్లాడుతున్న వైద్యాధికారి ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్‌:జిల్లాలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మిషన్ ఇంద్రధనస్సుపై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ప్రతీ పిల్లవాడికి, గర్భిణికి వ్యాధి నిరోధక టీకాలు అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమయానుసారం టీకాలు తీసుకోని పిల్లలు, గర్భిణులను గుర్తించి సకాలంలో టీకాలు ఇవ్వడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఆగస్టు 7 నుంచి 12, సెప్టెంబర్ 11 నుంచి 16, అక్టోబర్ 9 నుంచి 16 తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. వ్యాక్సిన్ తీసుకోని పిల్లలు, గర్భిణులను గుర్తించేందుకు ప్రతీ గ్రామంలో హెడ్‌కౌంట్ సర్వే నిర్వహించి పకడ్బందీగా యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అతుల్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నయనరెడ్డి, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, సామాజిక ఆరోగ్య అధికారి గిరిబాబు, ఆరోగ్య విస్తరణ అధికారులు వేణుగోపాలరావు, చంద్రశేఖర్, రుష్యంత్‌రెడ్డి, జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ రూరల్:కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని 3 గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ దిగజారుడుతానానికి నిదర్శనమని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్మల్‌రూరల్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలోని రైతు వేదికలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఐకే.రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం అంటే తెలుసా.. ఆయన ఏనాడైనా వ్యవసాయం చేశాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మళ్లీ అంధకారంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. దేశంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ రైతులను రాజకీయ ఓటు బ్యాంకుగా చూసిందే తప్ప ఏనాడు వారి సంక్షేమానికి పనిచేయలేదని విమర్శించారు. తెలంగాణలో రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకుంటుంటే కాంగ్రెస్ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మూడు గంటల కరెంటు కావాలా? మూడు పంటల బీఆర్‌ఎస్ పార్టీ కావాలో రైతులు తేల్చుకోవాలన్నారు. అనంతరం 24 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని, 3 గంటలు వద్దు 3 పంటలు కావాలని తీర్మానం చేశారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం.. వ్యాధులతో పైలం!



ఈ దృశ్యం జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో జనావాసాల మధ్యలోనిది. కొన్నిరోజులుగా కురుస్తున్న ముసురు వానకు నీరుచేరి ఇలా మురికి కూపంలా మారింది. ఇక్కడ దోమలు, ఈగలు, బ్యాక్టీరియాలు వృద్ధిచెంది చుట్టుపక్కల ఇళ్లలోని ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. జిల్లా కేంద్రంలోని చాలా ప్రాంతాల్లో ఇలాంటి మురికి కూపాలు అనేకం ఉన్నాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా వర్షాలకు పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయి. పంచాయతీ కార్మికుల సమ్మెతో పారిశుధ్యం లోపిస్తోంది.

- ముసురు వానలతో చిత్తడిగా మారుతున్న పల్లెలు, పట్టణాలు
- ఖాళీ స్థలాల్లో నిలుస్తున్న నీరు
- పెరుగుతున్న దోమలు, ఈగలు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన



ఇలాంటి వాటితోనే వ్యాధులు ప్రబలే ఆస్కారం..

నిర్మల్ ఖిల్లా: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రోగాల బారిన పడక తప్పదని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. ముందు జాగ్రత్తలతో వ్యాధుల రాకుండా చూసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఏమరుపాటుగా ఉంటే డెంగీ, డయేరియా, చికున్ గన్యా, ఫైలేరియా ప్రబలే అవకాశం ఉంది.

అపరిశుభ్రతే అసలు సమస్య..

మురికినీరు, పరిశుభ్రత లోపించిన వాతావరణంతో దోమలు వృద్ధిచెంది డెంగీ, మలేరియా, చికున్ గన్యా, మెదడువాపు వ్యాధులు ప్రబలుతుంటాయి. వర్షాకాలంలో ఇవి తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఇప్పటికే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళ, శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నారు.

పొంచిఉన్న డెంగీ, దయేరియా ముప్పు..

కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, కోడిగుడ్డు పెంకులు, మొక్కల తొట్టీలు, వృథాగా ఉన్న టైర్లు, వాడిన కూలర్లలో నీళ్లు ఉంటే.. డెంగీ ప్రబలే అవకాశం ఉంటుంది. మురుగు నీరు, నిల్వ నీరు మలేరియా, ఫైలేరియా ప్రబలేందుకు దోహదం చేస్తాయి. దీంతో డయేరియా కేసులు, వివిధ రకాల జ్వరాలు ఎక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉంది. వానాకాలంలో పరిస్థితి మరింత తీవ్రత దాటే అవకాశం ఉన్న దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద నీటి నిల్వ పాత్రలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు ఖాళీ చేసి శుభ్రం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతపై ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాధులు–లక్షణాలు:

టైఫాయిడ్ కలుషిత నీటిని తాగడం వల్ల, బహిరంగ మలవిసర్జన వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒంటి నొప్పులు, తలనొప్పి, కడుపులో అల్సర్‌లు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. సురక్షిత నీటిని తాగడం, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వైద్యం పొందడం ద్వారా నయం కావచ్చు.

మలేరియా

ఎనాఫిలస్ అనే దోమ కుట్టడం ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. వైవాక్స్ మలేరియా, ఫాల్సీఫారమ్ మలేరియా అనే రెండు రకాలు ఉన్నాయి. ఇందులో రెండో రకం అత్యంత ప్రమాదకరమైంది. జ్వరం వచ్చినప్పుడు సకాలంలో చికిత్స తీసుకోకుంటే చనిపోయే ప్రమాదం ఉంది. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం, తీవ్రమైన తలనొప్పి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలి

డయేరియా

కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహారం తీసుకోవడం ద్వారా డయేరియా వ్యాపిస్తుంది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఆగకుండా విరోచనాలు, వాంతులు కావడం ఈ వ్యాధి లక్షణాలు. డయేరియా నివారణకు వైద్యులు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పులుపు, కారం ఉండే ఆహారాన్ని తగ్గించడం, ఫాస్ట్ ఫుడ్ వంటివి తినకపోవడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

ఆరోగ్యశాఖ అప్రమత్తం...

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న ప్రాంతాలను ఆరోగ్యశాఖ అధికారులు సర్వేల ద్వారా గుర్తిస్తున్నారు. జిల్లాలోని పట్టణాలు, పల్లెలలో చెత్తాచెదారం నీరు నిల్వ ఉండకుండా దోమలను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని మూడు ప్రధాన పట్టణాలైన నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లోని 80 వార్డులు, 396 గ్రామపంచాయతీలో 476 బృందాలతో ఇంటింటి సర్వే కొనసాగిస్తున్నారు. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఈ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. పట్టణంలోనైతే మున్సిపల్, ఆరోగ్య అధికారి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. జ్వర పీడితులను గుర్తించి మందులు ఇచ్చే ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

చర్యలు చేపడుతున్నాం...



వానాకాలం సీజన్‌కు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉంది. ఇప్పటికే వివిధ స్థాయిల్లో అధికారులు, సిబ్బందితో సమావేశాలు నిర్వహించి అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను తెలిపాం. స్థానిక సంస్థల సహకారంతో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకుంటున్నాం.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వేలు కొనసాగుతున్నాయి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అన్నిశాఖల సమన్వయంతో తగిన చర్యలు చేపడుతున్నాం. అనారోగ్య సమస్యలుంటే సమీపంలోని పీహెచ్‌సీ వైద్యులను సంప్రదించాలి. – డాక్టర్ ధనరాజ్, జిల్లావైద్యాధికారి, నిర్మల్

క్లుప్తంగా

జాతీయస్థాయి సమ్మేళనానికి మాలీ నేతలు


జాతీయ సమ్మేళనానికి తరలిన నేతలు

ఆదిలాబాద్‌రూరల్: అఖిల భారతీయ మాలీ మహాసంఘం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మహారాష్ట్రలోని నాసిక్‌లో బుధవారం నిర్వహించనున్న జాతీయస్థాయి సమ్మేళనానికి తెలంగాణ నుంచి తొమ్మిది మంది నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న మాలీలకు ఎస్టీ హోదా కల్పించే విధంగా తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో అనేక రాష్ట్రాల మాలీ ప్రతినిధులు పాల్గొననున్నారన్నారు. నాసిక్‌కు బయలుదేరిన వారిలో సుభాష్ షిండే, మురళీధర్ నాగోషే, అంబాదర్ షిండే, ధనుంజయ ప్రధాన్, విజయ్ వాడగురే, గజానన్ చౌదరి, మహిళా నేతలు కల్పన పెట్కులే, లక్ష్మి ఉన్నారు.

అన్నదమ్ముల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్

నేరడిగొండ: ఈ నెల 15న వడూర్ గ్రామంలో అన్నదమ్ముల మధ్య గొడవలో వారిని సముదాయించే యత్నంలో ఒకరు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు కందకూరి ప్రశాంత్ తండ్రి నర్సింగ్ ఈనెల 16న ఫిర్యాదు చేయగా బామిని గంగాధర్, పవన్‌కళ్యాణ్‌ను 17న వడూర్ బస్‌స్టాప్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అన్నదమ్ములు వారి సోదరికి తులం బంగారం విషయమై గొడవ పడుతుండగా, ప్రశాంత్ ఆపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ప్రశాంత్ తులసీ గద్దెపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ క్రమంలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

ఆదిలాబాద్‌టౌన్: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ స్పెషల్ జేఎఫ్‌సీఎం పీసీఆర్ కోర్టు మేజిస్ట్రేట్ దుర్గారాణి మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖిల్లాకు చెందిన హుస్సేన్ బిన్ పరాస్ అనే వ్యక్తికి సంజయ్‌నగర్‌కు చెందిన యువతితో వివాహమైంది. ఈ క్రమంలో వరకట్న వేధింపులతో పాటు మద్యం తాగి తరచూ గొడవకు దిగేవాడు. మానసికంగా, శారీరకంగా వేధించడంతో 2014 ఆగస్టు 31న బాధితురాలు ఆదిలాబాద్ మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై పద్మ కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఏపీపీ నవీన్‌కుమార్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ఈ మేరకు మెజిస్ట్రేట్ తీర్పునిచ్చినట్లు వివరించారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక (గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.భీమారావు తెలిపారు. తెలుగు–1, ఉర్దూ–1, చరిత్ర (ఉర్దూ మీడియం)–1, రాజనీతి శాస్త్రం–1, జంతు శాస్త్రం –1, కంప్యూటర్ సైన్స్–2 ఖాళీలు ఉన్నట్లు వివరించారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో 55% మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 24న ఉదయం 11 గంటల వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 25న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

భైంసా కళాశాలలో..

భైంసాటౌన్: భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని, నెట్, సెట్, పీహెచ్ డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఇంగ్లి ష్, ఉర్దూ లాంగ్వేజ్‌తోపాటు కంప్యూటర్ సై న్స్, పొలిటికల్ సైన్స్, ఉర్దూ మీడియంలో చరిత్ర, రాజనీతిశాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం, రసాయన శాస్త్రం అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 26న ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. వివరాలకు 9908393217, 7997020939 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అమాత్యుడికీ అడుసు తిప్పలు!

నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలోని రైతు వేదికలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో 24 గంటల ఉచిత విద్యుత్‌పై మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. అయితే ముసురు వానకు రైతువేదిక గేటు నుంచి భవనం వరకు మొత్తం బురదగా మారింది. కాలు తీసి కాలు వేయలేని పరిస్థితి. చేసేది లేక మంత్రితో సహా కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు రైతులు బురదలోని అడుగులు వేస్తూ కార్యాలయానికి చేరుకున్నారు. మంత్రి వస్తున్నారని తెలిసినా బురద లేకుండా చేయకపోవడంపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్


బురదలో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ రైతువేదికకు వస్తున్న మంత్రి, ప్రజా ప్రతినిధులు


ప్రధాన గేటు వద్దనే పరిస్థితి ఇలా...


పైన వర్షం.. కింద బురద..

రూ.18 లక్షల నిధులు స్వాహా

- స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ నిధులు పక్కదారి
- ఐకేపీ ఏపీఎం, సీసీ, డీఎంజీపై సస్పెన్షన్ వేటు
- ఉత్తర్వులు జారీ చేసిన డీఆర్‌డీవో

కైలాస్‌నగర్: స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు స్వాహా చేసిన ఘటన గుడిహత్నూర్ మండలంలో చోటు చేసుకుంది. రూ.18 లక్షలకు పైగా సభ్యుల నిధులు పక్కదారి పట్టించిన వైనం జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖలో చర్చనీయాంశంగా మారింది. సంఘ సభ్యులు ప్రతీనెలా చెల్లించే డబ్బులను బ్యాంకులో



జమ చేయాల్సిన సంబంధిత వీవోఏ సొంతానికి వాడుకున్నారు. కొత్త రుణం కోసం ఎస్‌హెచ్‌జీ సభ్యులు బ్యాంకును ఆశ్రయించగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఏడాదికి పైగా కిస్తీలను వీవోఏ దుర్వినియోగం చేసినట్లుగా తెలుసుకుని సభ్యులు ఖంగుతిన్నారు. ఈ వ్యవహారంపై స్థానిక ఓ ప్రజాప్రతినిధి భర్త డీఆర్‌డీఓ అధికారులతోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీడీ స్థాయి అధికారితో విచారణ జరిపించగా నిధుల దుర్వినియోగం జరిగినట్లుగా నిర్ధారించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. గుడిహత్నూర్ మండల ఏపీఎం భగవాండ్లు, సీసీ యాదవ్, డీఎంజీ (క్లస్టర్ లెవల్ అధికారి) గంగాధర్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ డీఆర్‌డీవో కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత వీవోఏపై చర్యలు చేపట్టేందుకు వీలుగా సంఘ సభ్యులకు ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని డీఆర్‌డీఓ అధికారులు బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తపడటం అనుమానాలకు తావిస్తోంది. దీనిపై డీఆర్‌డీవో కిషన్‌ను ఫోన్‌లో సంప్రదించగా, ఆయన ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

గుడిహత్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రసూతి గదితో పాటు మందుల గదిని ఆమె పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల వివరాలను వైద్యాధికారి శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది స్థానికంగా ఉంటున్నారా? లేదా? అని ఆరా తీశారు. స్థానికంగా ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.


బాలింతకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు

ఇచ్చోడ: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాల, బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలను మంగళవారం తనిఖీ చేశారు. స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వల రికార్డులు పరిశీలించారు. వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఆర్సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సీఎండీ

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. సీఎండీ గోపాల్‌రావుకు జిల్లా ఈఈ, డీఈ, ఏఈలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతించారు. సీఎండీ గోపాల్ రావు కుటుంబసమేతంగా సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధి రాంనగర్‌లో గల పెట్రోల్ పంపు సమీపంలో కాటిపెల్లి విలాస్‌రెడ్డి (52)ని గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఇచ్చోడ మండలం బోరిగామ గ్రామానికి చెందిన విలాస్‌రెడ్డి ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దివ్యాంగుడు కావడంతో రోజు మాదిరిగా మంగళవారం మూడు చక్రాల వాహనంపై ఆదిలాబాద్‌కు డ్యూటీకి వస్తున్నాడు. ఈ క్రమంలో రాంనగర్ సమీపంలో ఆయనను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆయన కింద పడిపోయాడు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అతడిని రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భారీ ఇసుక డంప్ స్వాధీనం

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ శివారులో పెన్‌గంగ నది తీరాన నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఆర్‌ఐ నితిన్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం తనిఖీ చేశారు. వీటిని లెక్కించి మొత్తం 1,085 ట్రాక్టర్ల, 250 టిప్పర్ల ఇసుక కుప్పలు సీజ్ చేసినట్లు తెలిపారు.

భగీరథ గదిలో పేకాట

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో కడెం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామ శివారులోని మిషన్ భగీరథ సంపు నిర్వహణ గదిలో పేకాట ఆడుతున్న 15 మందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.48,910 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు కడెం, జన్నారం మండలాలకు చెందినవారని ఎస్సై రాజు తెలిపారు.

సీఐల బదిలీలు

మంచిర్యాలక్రైం: ఎన్నికల బదిలీల్లో భాగంగా మల్టీజోన్–1 పరిధిలో 45మంది సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో రామగుండం పోలీసు కమిషనరేట్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేస్తున్న తొమ్మిది మందిని బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రామగుండం ట్రాఫిక్ పీఎస్ సీఐ కే.ప్రవీణ్‌కుమార్ మంచిర్యాల మహిళా పోలీసుస్టేషన్‌కు, ఇక్కడ పని చేస్తున్న టి.ప్రవీణ్‌కుమార్‌ను రామగుండం ట్రాఫిక్ పీఎస్‌కు, రామగుండం సీసీఆర్‌బీ సీఐ కోట బాబురావును బయ్యారం సర్కిల్‌కు, రామగుండం టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్.కృష్ణను లక్సెట్టిపేటకు, లక్సెట్టిపేట సీఐ వై.కృష్ణారెడ్డిని సిద్దిపేట–1టౌన్‌కు బదిలీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీసీ ఆర్‌బీ ఆదిలాబాద్ సీఐ జే.గుణవంత్‌రావు, సీసీఎస్ ఆదిలాబాద్ సీఐ ఈ.చంద్రమౌళి, సీసీ ఎస్ నిర్మల్ సీఐ ఎన్.శ్రీనివాస్, సీఆర్‌బీ నిర్మల్ సీఐ అజయ్‌బాబులను మల్టీజోన్–1 హైదరాబాద్ ఐజీపీకి అటాచ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంతర్జాతీయ నృత్య పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాలకేంద్రం చిన్నారులు కూచిపూడిలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 13 నుంచి 16వరకు థాయిలాండ్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. ఎంపికైన చిన్నారులను సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ సోమవారం రాత్రి బాల కేంద్రంలో అభినందించారు. జ్ఞాపికలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు రవీందర్, ఉపాధ్యక్షుడు సృజన్, శ్రావణ్ కుమార్, అనూష, రుచిత, రాము తదితరులున్నారు.

పోటీలకు ఎంపికైంది వీరే..
పన్నాల లాస్య, కొంకటి ఇతీక్ష, హర్షినీ ఠాకూర్, శ్రీవర్ధిని, శ్రీనిధి గడ్డం, హర్షిని దువాస, తన్వి భారతాల, మచ్చ సాత్విక, సామ మహతి, హశ్విత గుండేటి, చిలుక ఆమని, ఉమారాణి.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: క్రీడా పాఠశాలల రాష్ట్రస్థాయి పోటీలకు 40 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. నాలుగు, ఐదో తరగతుల్లో ప్రవేశాల కోసం 20 మంది బాలురు, బాలికలను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు మేడ్చల్ జిల్లా హకీంపేటలోని తెలంగాణ క్రీడాపాఠశాలలో ఈనెల 25 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులు..
నాలుగోతరగతి (బాలురు): ఆత్రం అరవింద్, రాపెల్లి అనిరుధ్, పృథ్వీరాజ్, సాకేత్, అర్జున్‌రెడ్డి, స్వరూప్, రోహన్, శ్రీరామ్ భువనేశ్వర్, నిఖిల్.
బాలికలు: పూర్విక రాజ్, మీరా, రిషిక, ఆరాధన, రోషిని, హర్షిని, శృతి, మీనాక్షి, శిరీష.
5వ తరగతి (బాలురు): అన్షువర్ధన్, విశ్వానంద్, తేజస్, శ్రీవర్ధన్, రుత్విక్, రుతుధ్వజ్, విశ్వతేజ, గౌతమ్, దేవాన్ష్, చరణ్.
బాలికలు: అక్షర, వెన్నెల, కాజల్, మధుశ్రీ, పరిణీతి, మైథిలి, అఖిల, మీనాక్షి, మహాలక్ష్మి, దుర్గ.

రిజర్వేషన్ సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

ఆదిలాబాద్‌రూరల్: గౌడ కులస్తులకు జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్లు సాధించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని గౌడజన హక్కుల పోరాటసమితి జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని మాల సంక్షేమ సంఘ భవనంలో గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని కులాల సంక్షేమానికి నిధులు కేటాయించిన ప్రభుత్వం గౌడ కులస్తులకు మృతి చెందితే ప్రమాద బీమా ఇస్తామని ప్రకటించడం సరైంది కాదన్నారు. బీసీలకు మాదిరిగా గౌడ కులస్తులకు రూ.లక్ష సాయం వర్తింపజేయాలన్నారు. ఏజెన్సీ గీత కార్మికుల లైసెన్స్‌లు పునరుద్ధరించాలన్నారు. గీత కార్పొరేషన్‌కు రూ. 5వేల కోట్ల నిధులు కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపతి లింగాగౌడ, రాష్ట్ర అధికార ప్రతినిధి నారాయణ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ చందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, భూపతిగౌడ్, నాందేవ్ గౌడ్, నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, జిల్లా నాయకులు సంతోష్ గౌడ్, అంజగౌడ్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న గౌడ సంఘం నేతలు

ఘనంగా శీత్లా పండుగ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాలో గిరిజనులు మంగళవారం శీత్లా పండుగ ఘనంగా జరుపుకున్నారు. శ్రావణమాసంలో నిర్వహించే ఈ ఉత్సవాలను గ్రామానికి చెందిన బంజారా గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాల్లో పాల్గొన్నారు. వానాకాలంలో పంటలు సమృద్ధిగా పండి ప్రజలు, పశువులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఏటా ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు భూక్య జాన్సన్‌నాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులతో కలిసి నృత్యం చేశారు.


ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె వాయిదా

నిర్మల్‌చైన్‌గేట్: విద్యాశాఖ మంత్రి వంట కార్మికులకు ఈనెల నుంచి పెంచిన వేతనాలు విడుదల చేస్తామని ప్రకటించినందుకు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు భూక్య రమేశ్ తెలిపారు. వేతనాలు విడుదల కాకపోతే మళ్లీ సమ్మె చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం వేతనాల పెంపు జీవో ఈఏడాది ఫిబ్రవరిలో జారీ చేసిందని తెలిపారు. అప్పటి నుంచి వేతనాల పెంపు అమలు చేయలన్నారు. 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు పూర్తిగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వంట సరుకులు, కోడిగుడ్లు, వంట పాత్రలు ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అకారణంగా కార్మికులను తొలగించకూడదని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రజిత, లక్ష్మి, కవిత, మనీషా, మల్లేశ్, మొనవ్వ, భోజవ్వ, రూప, భాగ్య, ఉమ, మనీషా, అమృత, సాయివ్వ, వహీద, ప్రమీల, సుల్తానా పాల్గొన్నారు.

పాలనురగల ‘పొచ్చెర’


బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతం జలకళను సంతరించుకుంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీరు చేరడంతో పాలనురగలా పరవళ్లు తొక్కుతోంది. చూపరులను ఆకట్టుకుంటోంది.

సదర్మాట్‌కు జలకళ

ఖానాపూర్: మండలంలోని మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్ ఆనకట్ట జలకళ సంతరించుకుంది. కొద్దిరోజులుగా ఎగువభాగంలో కురుస్తున్న వర్షాలతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సదర్మాట్ ఆనకట్ట పూర్తి నీటిమట్టం 7.6 ఫీట్లు కాగా, ప్రస్తుతం 7.10 ఫీట్లలో నీరు గోదావరిలోకి వెలుతుందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. దీంతో సదర్మాట్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది.



పెరుగుతున్న కడెం నీటిమట్టం

కడెం: కడెం ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, మంగళవారం రాత్రి వరకు 688.850(5.030టీఎంసీ) అడుగులుగా ఉంది. ప్రాజెక్ట్‌కు 2,847 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలు ఉన్నందున.. ఏ సమయంలోనైనా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. ప్రాజెక్ట్ పరీవాహక ప్రాంత ప్రజలు, పశువుల కాపరులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

కుంటాలలో జోరువాన

కుంటాల: మండలంలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో మంగళవారం ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మోస్తరు వర్షానికి ఓలా–లింబా(బి) గ్రామాల మధ్య ఉన్న లోతట్టు వంతెనపై నుంచి వరద ప్రవహించడంతో లింబా(బి), లింబా(కే), భైంసా, కుభీర్ మండలంలోని చాతా, చింతల్‌బోరి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. మండలంలో 4 సెం.మీల వర్షం కురిసినట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.


కల్లూర్ చెక్‌డ్యాం మీదుగా ప్రవహిస్తున్న వరద